క్లుప్తంగా

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



చిన్నారాయుడుపేటలో పనులు పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీఓ

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వీటిని ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ పర్యవేక్షించారు. లచ్చయ్యపేట, చిన్నారాయుడుపేట, సూరంపేట, అంటిపేట, గుచ్చిమి, పెదబోగిలి, చొనబోగిలి, కొత్తవలస, బగ్గందొరవలస తదితర గ్రామాల్లో పనులు చేపట్టారు. చిన్నరాయుడుపేటలో పనులు పరిశీలించిన ఈఓపీఆర్‌డీ మాట్లాడుతూ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు కార్యదర్శుల పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నామన్నారు.

కమిషనర్‌ను కలిసిన ప్రీ ఆడిట్ సభ్యులు



మున్సిపల్ కమిషనర్‌ను కలసిన ప్రీ ఆడిట్ సభ్యులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పురపాలక సంఘానికి సంబంధించి నూతనంగా వచ్చిన ప్రీ ఆడిట్ సిబ్బంది మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా సోమవారం కలిసి ప్రీ ఆడిట్ గురించి చర్చించారు. కార్యక్రమంలో ప్రీ ఆడిట్ సిబ్బంది అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ హేమసుందరరావు, సీనియర్ ఆడిటర్‌లు మరడాన శంకర్, చందక సత్యం, మున్సిపల్ జూనియర్ జూనియర్ అకౌంటు ఆఫీసర్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి శాకంబరి ఉత్సవాలు



పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో మంగళవారం నుంచి శాకంబరి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వి.వి.సూర్యనారాయణ తెలిపారు. ఆషాఢ మాసం పురస్కరించుకొని, చదురుగుడి, వనంగుడిలలో కొలువైన పోలమాంబ అమ్మవార్లకు వివిధ రకాల కూరగాయలతో, పండ్లతో అలంకరించనున్నారు. పోలమాంబ అమ్మవారు మంగళవారం భక్తులకు శాకంబరిదేవిగా దర్శనమివ్వనున్నారు.

పట్టణ సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యారావు

పార్వతీపురం టౌన్: పట్టణంలో ప్రధాన సమస్యలు పరిష్కరించాలని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పి.సూర్యారావు అన్నారు. వినియోగదారుల సంఘం కార్యాలయంలో సంఘ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను, పట్టణంలో కుక్కల బెడద విపరీతంగా ఉన్నందున వాటిపై మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో వీధి బండ్లపై పకోడీలు, పానీపూరి, రంగులు కలిపిన మసాలా మాంసాహార పదార్థాలు, మాంసం దుకాణాలు, హోటళ్లు తదితర వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సంఘ సభ్యులు మధు, శ్రీహరి అప్పలరాజు, ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ : రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి గవర్నర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా విజయవాడ నుంచి ఆయన ఫోన్‌లో సాక్షితో మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కూటమి నాయకులు రెడ్‌బుక్ పేరుతో రక్తచరిత్ర రాస్తున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఆడపిల్లలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దిశ చట్టం పూర్తిగా నీరుగారిపోవడంతో మానవ మృగాలు చేలరేగిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆశలు తీరేనా...!



రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలతో పాటు స్థానిక సమస్యలు పరిష్కరిస్తామని కూటమి నాయకులు హామీలిచ్చారు. అయితే ఇంతవరకు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చిన దాఖలాలు లేవు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడంతో స్థానిక సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించి, పరిష్కరిస్తారన్న ఆశతో ప్రజలు చూస్తున్నారు. ఎమ్మెల్యేలు స్థానిక సమస్యలపై శాసనసభలో చర్చించి తమ కష్టాలు తీర్చుతారని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. – పార్వతీపురం టౌన్

ఇచ్చిన హామీలపై చర్చ జరపాలి



ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసి పార్వతీపురాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలి. పట్టణ ప్రధాన సమస్యలైన తాగునీరు, వరహాలగెడ్డ ముంపు, డంపింగ్ యార్డు సమస్యలు అసెంబ్లీలో చర్చించి వాటికి శాశ్వత పరిష్కారం చూపాలి. ఎమ్మెల్యే విజయచంద్ర పట్టణ సమస్యలను శాసనసభలో ప్రస్తావించి నిధులొచ్చేలా కృషి చేయాలి.

– పొందూరు లలిత, పార్వతీపురం పట్టణం

డంపింగ్ యార్డును తరలించాలి



డంపింగ్ యార్డు వల్ల శివిని గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న శివిని గ్రామం సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు పెద్ద సమస్యగా దశాబ్దాలుగా ఉంది. ఎన్నికల వేళ ఈ సమస్యను నెల రోజుల్లో పరిష్కారిస్తానని ప్రస్తుత ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ విషయమై శాసనసభలో చర్చించి పరిష్కారానికి ఎమ్మెల్యే విజయచంద్ర కృషి చేయాలి.

– బండి సాగర్, శివిని గ్రామం

తాగునీటిపై శాశ్వత పరిష్కారం లభించాలి



పార్వతీపురం పట్టణ వాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంపై శాసనసభలో చర్చ జరగాలి. గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.68 కోట్లు నిధులు తిరిగి మంజూరు చేసి పూర్తి స్థాయిలో పనులు జరిగేలా చర్యలు చేపట్టాలి. పట్టణంలో తాగునీరు అందరికీ అందించేలా చర్యలు చేపట్టాలి.

– పాలక సన్యాసి రావు, పార్వతీపురం పట్టణం

ముంపు సమస్యకు అడ్డుకట్ట ఎప్పుడో...



చిన్న పాటి వర్షానికి కూడా పార్వతీపురం పట్టణ ప్రధాన రహదారి జలమయం అవుతుంది. ఈ సమస్య పరిష్కారానికి పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అవసరం. వర్షం కురిస్తే చాలు వరహాల గెడ్డ పరిసర ప్రాంతాలు, కాలనీలు జలమయం అవుతున్నాయి. ఇళ్లలోకి వర్షపు నీరు చేసి ఆ ప్రాంత వాసులు ఇబ్బందులకు గురపుతున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే విజయచంద్ర అసెంబ్లీలో చర్చించాలి. సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేయాలి.

– గొర్లి వెంకట రమణ, సీపీఎం నాయకులు, పార్వతీపురం

మంత్రి మొదటి సంతకానికి మోక్షమెప్పుడో..!

పార్వతీపురం టౌన్: రాష్ట్ర గిరిజన మంత్రి మొదటి సంతకానికి మోక్షం ఎప్పుడని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ప్రశ్నించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూలై 6న జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థి బి.ఈశ్వర రావు మృతి చెందాడన్నారు. జూలై 7న శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న బి.రిష్మిత మృతి చెందిందని గుర్తు చేశారు. ఈ నెల 22న పార్వతీపురం మండలం రావికోన గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న పి.రాఘవ మృతి చెందాడని తెలిపారు. ఇన్ని సంఘటనలు వరుసగా జరుగుతున్నా ప్రస్తుత పాలకుల్లో స్పందన కనిపించడం లేదన్నారు. విద్యార్థుల ప్రాణాలు కాపాడాలనే చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు, కళాశాల వసతిగృహాలకు ఏఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎంల నియామకం కోసం మొదటి సంతకం చేసిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంతకానికి ఎప్పటికి మోక్షం కలుగుతుందని ప్రశ్నించారు. మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపులు

పార్వతీపురం టౌన్: పట్టణంలో మంగళవారం నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు రోజుల పాటూ ఆధార్ ర్యాంపులు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో చర్చి వీధి సచివాలయం, వాసవి జూనియర్ కళాశాల, 25, 26న గాంధీ నగర్, కొత్తవలస సచివాలయంలో, 27 కొత్త బెలగాం, మేదర వీధి సచివాలయాల్లో క్యాంపులు పెడతామని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు వారంతా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.

మినీ గోకులాల నిర్మాణాలకు నిధులు మంజూరు

సీతానగరం: ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకందారుల మినీ గోకులాల షెడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తుందని ఆ శాఖ ఏడీ డాక్టర్ సీహెచ్ దీనకుమార్ తెలిపారు. స్థానిక పశువైద్య కేంద్రంలో ఆయన సోమవారం మాట్లాడారు. పశువులు, మేకలు, గొర్రెలు పెంపకం చేస్తూ జీవనోపాధి పొందుతున్న కుటుంబాల వారు మినీ గోకులాలు నిర్మిస్తే నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. అయితే వీటిలో లబ్ధిదారుని వాటాగా కొంత మొత్తం సమకూర్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు స్థానిక పశువైద్య కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రైల్వే పనులపై రైతుల ఆవేదన



రైల్వే మూడోలైన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలం నర్సిపురం రైల్వే మూడో లైన్ పనులపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే మూడో లైన్‌కు గ్రామానికి చెందిన రైతులు కొంత మేర భూములు ఇచ్చారు. దీంతో రైల్వే శాఖాధికారులు పనులు చేపట్టారు. ఈ క్రమంలో పనులు జరుగుతున్న ప్రదేశంలో పలువురు రైతులు సోమవారం నిరసన తెలిపారు. పనులు పూర్తయితే తమ పొలాలకు వెళ్లేందుకు దారి సమస్య ఏర్పడుతుందని వారు పేర్కొన్నారు. రైల్వే లైన్ సమీపంలో భూములు ఉన్న సుమారు 150 మంది తమ పొలాలకు వెళ్లేందుకు మార్గం ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు జరుగుతున్నప్పుడే పొలాలకు వెళ్లేందుకు మార్గం వేయాలని కోరారు. రైల్వే అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

దోమల నివారణకు ఫాగింగ్



దుగ్గేరులో ఫాగింగ్

మక్కువ: మండలంలోని పనసబద్ర పంచాయతీ దుగ్గేరు గ్రామంలో సోమవారం పంచాయతీ కార్యదర్శి గణేష్ పర్యవేక్షణలో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. గ్రామంలోని అన్ని వీధులలో, ఇంటి పరిసరాల్లో ఫాగింగ్ చేయించారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో, దోమకాటుతో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు, ముందుస్తుగా ఫాగింగ్ జరిపిస్తున్నారు. పనసబద్ర పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పక్షోత్సవాలు సందర్భంగా పారిశుద్ధ్య పనులు జరిపిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి గణేష్ తెలిపారు.

పీహెచ్‌సీ ఏర్పాటుకు వినతి

మక్కువ: గిరిజన ప్రాంతమైన దుగ్గేరు, ఎర్రసామంతవలస గ్రామాలలో ఏదో ఒకచోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుపై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లాలని వైద్యాధికారిణి నిఖిలను సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు కోరారు. మక్కువ పీహెచ్‌సీని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు సోమవారం సందర్శించారు. రోగులను సమస్యలను వైద్యాధికారిణి నిఖిల దృష్టికి తీసుకువెళ్లారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. పనసబద్ర పంచాయతీ పరిధిలో అత్యధికంగా గిరిజన గ్రామాలు ఉన్నాయని, పలు గ్రామాలకు రహదారి సౌకర్యం, వంతెన సౌకర్యం లేకపోవడంతో సకాలంలో వైద్యం అందక ఆర్ఎంపీలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. సాలూరు మండలానికి చెందిన పలు గిరిజన గ్రామాలు మక్కువకు సమీపంలో ఉన్నాయన్నారు. గిరిజన గ్రామాల నుంచి మక్కువ, శంబర పీహెచ్‌సీలకు రోగులు చేరుకోవాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. దుగ్గేరు, ఎర్రసామంతవలస గ్రామాలలో పీహెచ్‌సీ నిర్మిస్తే, గిరిజన ప్రాంతాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండటంతో పాటు, సకాలంలో వైద్యం అందుతుందన్నారు. మక్కువ పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న ఆయుర్వేద వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలన్నారు.

టీఎల్ఎంలతో బోధన విజయవంతం



సీతానగరం: మాట్లాడుతున్న ఏఎంఓ శ్రీనివాసరావు

బలిజిపేట: టీఎల్ఎంలతో బోధన కార్యక్రమం విజయవంతమైందని ఎంఈఓ – 1 సామల సింహాచలం తెలిపారు. శిక్షా సప్తాహ్ రోజువారీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాఠశాలల్లో సోమవారం టీఎల్ఎంలతో బోధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు పాఠశాలలో బోధనా పద్ధతులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పద్ధతిలో విద్యార్థికి సమీపంలో ఉండే బోధనోపకరణాలను వినియోగించి బోధించారన్నారు. బొమ్మల తయారీ, కార్డుల తయారుచేసి వాటిని ఉపయోగించి బోధించడం వలన విద్యార్థులలో అవగాహన పెరిగి మంచి విద్యకు అవకాశాలు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బలిజిపేట: ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఎంఈఓ-1సామల

ప్రాథమిక పాఠశాల సందర్శన

సీతానగరం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆదర్శ పాఠశాలను రాష్ట్ర, జిల్లా పర్యవేక్షకులు సోమవారం పరిశీలించారు. పాఠశాలలో విద్యా ప్రవేశం, కార్యక్రమం నిర్వాహణతో పాటు ఈ రోజు నుంచి ప్రారంభించిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మేరకు ఏఎంఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ జూలై 22న స్థానిక వనరులను ఉపయోగించి బోధన చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జీ.సూరిదేముడు, స్టేట్ కోఆర్డినేటరు జి.నాగరాజు, జిల్లా కోఆర్డినేటరు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, సీఆర్పీలు, ఎంఆర్‌సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనత కేసులపై ప్రత్యేక దృష్టి

- రక్తనిధి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



ఏరియా ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సాలూరు: రక్తహీనత కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. పట్టణంలో ఏరియా ఆస్పత్రిని ఆయన సోమవారం సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, సదుపాయాలు తదితర అంశాలపై ఆరా తీసారు. చికిత్స పొందుతున్న చిన్నారులు, పెద్దలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు రక్తపరీక్షలు చేసి రక్తహీనతను పరిశీలించాలని అన్నారు. జిల్లాలో రక్త నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని సేకరించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎక్కువ రక్తనిధి కేంద్రాలు ఏర్పాటుకు ప్రయత్నిస్తామని తెలిపారు. గర్భిణులలో రక్తహీనతను అధిగమించే చర్యలు తీసుకోవడం వలన ప్రసవ సమయంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడవచ్చని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం విధిగా అందించాలని దీనిపై పక్కాగా పర్యవేక్షణ చేయాలని అన్నారు.

ఏరియా ఆస్పత్రిలో రోగులు తాకిడి అధికంగా ఉన్నందున తాత్కాలిక షెడ్ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేసామని తెలిపారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.శివకుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రత్నకుమారి, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్ జనార్దన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

బలిజిపేట: రైతు సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వివిధ సమస్యలతో సతమతమవుతున్న రైతుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ జనార్దన్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించాలని, పంటపై కేంద్రం ప్రకటించిన మద్దతు ధరపై అదనంగా రూ.500 ప్రకటించి అమలు చేయాలని, కౌలు రైతులందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రూ.2లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధి పనుల బిల్లులు వెంటనే చెల్లించాలనే వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జి.సత్యనారాయణ, బి.భానుమూర్తి, ఎస్.ఈశ్వరరావు, ఎస్.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఉబాలు



లక్ష్మీపురంలో వరినాట్లు వేస్తున్న మహిళలు

సీతానగరం: బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలకు ఖరీఫ్ సాగుకు అవసరమైన నీరు పొలాల్లో చేరింది. దీంతో మండలంలో అన్ని గ్రామాల్లో ఉబాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే పొలాల్లో పచ్చిరొట్ట పంట ఏపుగా పెరగడంతో వరినాట్లు వేసేందుకు నారు అందక పోయినా వర్షానికి చేరిన నీటితో పచ్చిరొట్ట పంటను దమ్ముచేసి మళ్లలో కుళ్లబెట్టడానికి యంత్రాలతో కుళ్ల దమ్ములు చేశారు. ఈ పనులు చేసి వారం రోజులు కావడంతో ఉబాలు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వరి నాట్లు కూడా వేస్తున్నారు. అన్ని గ్రామాల్లో ఉబాలు, వరి నాట్లు వేసే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఖరీఫ్ సాగు నేపథ్యంలో ఏఓ ఎస్.అవినాష్ మాట్లాడుతూ సాగుకు అవసరమైన రసాయనిక ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సేంద్రియ ఎరువు ఉత్పత్తికి పచ్చిరొట్ట పంటలు సాగు చేయడం వల్ల ఎరువుల మోతాదు తగ్గించి వాడాల్సి వస్తుందని వివరించారు.

విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు



మక్కువలో పారిశుద్ధ్య పనులపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

పార్వతీపురం: పారిశుద్ధ్య కార్యక్రమాలను ఈ నెల 16 నుంచి గ్రామాల్లో, పట్టణాల్లో విస్తృతంగా చేపడుతున్నారు. ఈ నెల 16 నుంచి పారిశుద్ధ్య పక్షోత్సవాల్లో భాగంగా కాలువల్లో పూడిక తీత, దోమల లార్వా వృద్ధి చెందకుండా, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు లార్వా నివారణ రసాయనాలను పిచికారీ చేస్తున్నారు. మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీలో పూడికలు తొలగించడం, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపు, బావులు, కుళాయిలు, బోర్ల వద్ద మురుగునీరు నిల్వ వుండకుండా పనులను చేపడుతున్నారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీఓ జిల్లా మలేరియా అధికారి సమన్వయంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పారిశుద్ధ్య పక్షోత్సవాలను ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

రాయగడ – గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలును పునరుద్ధరించాలి



స్టేషన్ మాస్టర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పార్వతీపురం టౌన్: నిలిపివేసిన రాయగడ – గుంటూరు ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌ను కొనసాగించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పి.సంఘం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం స్టేషన్ మాస్టర్ శ్రీనివాస్ రావుకు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎంతో మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్న రాయగడ – గుంటూరు ఎక్స్‌ప్రెస్‌ను నిలిపివేయడంతో, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగస్తులు, చిరు వ్యాపారస్తులు, విద్యార్థులు, ప్రయాణికులకు ఈ రైలు అనుకూలంగా ఉండేదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు బొత్స కుమార్, బత్తుల కృపారావు, పిట్ట ఆదినారాయణ, సతీష్, సత్యనారాయణ, రాము, శ్రీను పాల్గొన్నారు.